# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం | 20 డిసెంబరు, 2025 | పేజీలు : 06


## ప్రతి కాలనీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు



మెయిన్‌లో

# సైబర్ నేరాల పట్ల అవగాహన: ఎస్‌పి

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్ట్ పేరుతో వీడియో కాల్స్ చేసి పోలీసులం అంటే నమ్మవద్దని, సైబర్ మోసం అని గుర్తిస్తే వెంటనే 1930 కు ఫిర్యాదు చేయాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ సూచించారు. సైబర్ నేరాల నుండి ప్రజలకు విముక్తి కల్పించాలని పోలీసు శాఖ చేస్తున్న విస్తృత ప్రయత్నంలో భాగంగా, సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాన కల్పించే వివిధ రకాల ఆన్లైన్ మోసాలను సూచించే పోస్టర్లను జిల్లా ఎస్పీ డా. శబరీష్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఆకర్షణీయమైన ప్రకటనలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని నమ్మిస్తూ సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలను పాల్పడుతున్నారని, సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ పోలీసు అధికారి కూడా నేరుగా వీడియో కాల్స్ చేయరాని, అసలు డిజిటల్ అరెస్ట్ అనేది లేదు అని గుర్తించాలని ఎస్‌పి స్పష్టం చేశారు. నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్లను, వెబ్‌సైట్లు రూపొందించి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని చెప్పుతూ వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారా లింకులు పంపి మోసపూరిత వాగ్దానాలతో ఆన్లైన్ మోసాలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. సైబర్ నేరస్తులు పన్నిన మోసపూరిత ఆఫర్లను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, అనుమానాస్పద కాల్స్ లేదా లింకులు ఎదురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు తిరుపతి రావు, కృష్ణ కిషోర్, గంద్రతి మోహన్, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.






## ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** ప్రభుత్వ పాఠశాల లోనే మెరుగైన విద్య లభిస్తుందని, మండల నోడల్ అధికారి, విష్ణుమూర్తి అన్నారు. మండలం లోని, కుందారం గ్రామంలోని, హరిజన పాఠశాలలో , చదువుతున్నటువంటి, 50 మంది విద్యార్థులకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యేరువ వెంకటేశ్వర రెడ్డి , 18000 వేల రూపాయల,విలువగల దుస్తులను, శుక్రవారం వారు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, కృషి పట్టుదల ఉంటే, సమాజంలో దేనినైనా సాధించవచ్చు అని, విద్యార్థులు దృఢ సంకల్పంతో, భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రవేట్ పాఠశాలకు దీటుగా విద్యార్థులకు, పాఠశాలలో, అన్ని వసతులు కల్పిస్తున్నారని వారు పేర్కొన్నారు. విద్యార్థులు, చిన్నతనం నుండే, క్రమశిక్షణతో కలిగి ఉంది, విద్యతోపాటు, సాంస్కృతిక కార్యక్రమంలో రాణించాలని భవిష్యత్తులో, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు, గ్రామానికి, రాష్ట్రానికి, దేశానికి, మంచి పేరు తీసుకురావాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో, కాంప్లెక్స్ హెడ్మాస్టర్, రవీందర్, జెడ్పిహెచ్ఎస్, హెడ్మాస్టర్, రవిశంకర్, సిపిఎస్ హెడ్మాస్టర్, మంజుల, హెడ్మాస్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఏఏపీసి చైర్మన్ స్వాతి, ఉపాధ్యాయురాలు, అనురాధ, వసుంధర, సంపూర్ణ, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

## తాళం వేసి వున్న ఇండ్లల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

**ప్రజాపక్షం/వరంగల్‌క్రైమ్:** కెయూసి పోలీస్ పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసి వున్న ఇండ్లల్లో చోరీకి పాల్పడుతున్న నిందితుడిని కెయూసి, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్టు చేసారు. అరెస్టు చేసిన నిం దితుడి నుండి పోలీసులు సూమారు ఐదు లక్షల విలువ గల 40 గ్రాముల బంగారు అభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత వివరాలను వెల్లడిస్తూ ఆసిఫాబాద్ జిల్లా తాండుర్ మండలం, రేచిని గ్రామం, ప్రస్తుతం హనుమకొండ పరిధిలో నివాసం వుంటున్న సబ్బాని రంజిత్ (24), తాండూర్ ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికుడి పనిచేస్తూ వచ్చిన డబ్బుతో మద్యం సేవిస్తూ జల్సాలకు చేయడంతో తనకు వచ్చే అదాయం తన జల్సాలకు సరిపోకపోవడంతో నిందితుడు సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందు కోసం నిందితుడు 2020 సంవత్సరంలో మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి పాల్పడటంతో నిందితుడుని పోలీసులు అరెస్టు చేసిన జెలుకు తరలించారు. జెలు నుండి విడుదలెన నిందితుడు తమ కుటుంబంతో కల్సి గత మూడు సంవత్సరాలు కెయూసి పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ నివాసం వుంటున్నాడు. ఈ నెల 12వ తారీఖున నిందితుడు నివాసం వుంటున్న పరిసరాల్లో నివాసం వుంటున్న దంపతులు ఇంటికి తాళం వేసి సినిమాకి పోయినట్లుగా గుర్తించిన నిందితుడు. ఎవరికి అనుమానం రాకుండా నిందితుడు ఆ ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 40గ్రాముల బంగారు అభరణాలతో పాటు 40వేల రూపాయల నగదు, ఒక సెలఫోన్ చోరీ చేసి అక్కడి నుండి తప్పించుకొని పారిపోయాడు. తమ ఇంటిలో దొంగలు పడినట్లుగా గుర్తించిన బాధితులు తమ ఫిర్యాదులు మాత్రం ఇంటిలో 250 గ్రాముల బంగారు అభరణాలు చోరీ జరిగినట్లుగా ఫిర్యాదు ఇవ్వడంతో వేగంగా పోలీసులు క్రైమ్స్ అదనపు డిసపి బాలస్వామి అదేశాల మేరకు దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకోని నిందితుడి కదలికలపై నిఘా పెట్టారు. శుక్రవారం ఉదయం కెయూసి, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా కలసి కెయూ జంక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఇదే ప్రాంతంలో అనుమానస్పదంగా తిరుగుతున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోని తనిఖీ చేయగా తాను చోరీ చేసిన బంగారు గాజులు గుర్తించిన పోలీసులు నిందితుడుని విచారించగా తాను చోరీ చేసిన ఇంటిలో కేవలం నాలుగు బంగారు గాజులు, 40 వేల రూపాయల నగదు, ఒక సెల్ ఫోన్ మాత్రమే చోరీ చేసినట్లుగా పోలీసుల ఎదుట అంగీకరించాడు. దీనితో బాధితుల ఇంటిలో కేవలం 40 గ్రాముల బంగారు అభరణాలు మాత్రమే చోరీ జరిగినట్లు గుర్తించిన పోలీసులు బాధితుల ఇంటిలో మరో మారు తనిఖీ చేయగా చోరీ అయింది అనుకున్నా మిగితా బంగారు అభరణాలు బాధితుల ఇంటిలోనే లభ్యం కావడం జరిగింది.ఈ చోరీ సంఘటన సంబంధించి సెంట్రల్ జోన్ డిసిపి మాట్లాడుతూ ఇకపై ఎవరైన బాధితులు ఎవరైన చోరీ గురైన సొమ్ము ఎక్కువ మొత్తంలో చోరీ జరిగినట్లు ఫిర్యాదు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిసిపి ప్రజలకు సూచించారు. నిందితుడుని పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన సిసిఎస్, కెయూసి ఇన్స్పెక్టర్లు రాఘవేందర్, రవికుమార్,ఫింగర్ ప్రింట్ విభాగం ఇన్స్పెక్టర్ దేవేందర్, కెయూసి ఎస్.ఐ శ్రీకాంత్, కిరణ్, ఏఏఓ సల్మాన్‌పాషా, హెడ్ కానిస్టేబుళ్ళు మహేశ్వర్, జంపయ్య, కానిస్టేబుళ్ళు మధుకర్, చంద్రశేకర్,వంశీ,విశ్వేశ్వర్,ఐటీ కోర్ కానిస్టేబుళ్ళు నగేష్, ప్రవీణ్ లను సెంట్రల్ జోన్ డిసిపి అభినందనలు తెలియజేసారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి

**ప్రజాపక్షం/ జనగామ:** ప్రభుత్వ ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్న టెట్ సమస్యపై కేంద్రం ఉదాసీనత సరికాదని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందే విధంగా కృషి చేయడంతో పాటు ప్రాధాన్యత ఇవ్వాలని యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో మౌళిక వసతులు కల్పించాలని, నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేయాలని, ఫిజిక్స్ వాల, ఖాన్ అకాడమీ వంటి సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకొని ఏర్పాటు చేస్తున్న క్లాసులు నిరుపయోగంగా ఉన్నాయని మండిపడ్డారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద పలు డిమాండ్లతో కూడిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కానుగంటి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పాఠాలు చెప్పనివ్వాలని, బోధనేతర పనులు భారం నుండి విముక్తుల్ని చేయాలన్నారు. రాష్ట్రంలో 45 వేల మంది దేశ వ్యాప్తంగా 25 లక్షల మంది ప్రత్యక్షంగా ప్రభావం చూపుతున్న టెట్‌పై సుప్రీం తీర్పు వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి సదస్సు ఈ నెల 28, 29 తేదీల్లో జనగామలోని మాంగళ్య పంక్షన్ హాల్‌లో జరగనుందన్నారు. కార్యక్రమానికి ఎంపి చామల కిరన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్విని‌రెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అలుగుబెల్లి నర్సిరెడ్డి జేఎసి ఛైర్మన్ మారం జగదీశ్వర్, కార్యదర్శి ఏలూరు శ్రీనివాస్ పాల్గొననున్నారన్నారు.. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రావు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కార్యదర్శులు కృష్ణ, కృష్ణమూర్తి, నర్సయ్య, గుండె కనకయ్య, చిదురాల రమేష్, సుధాకర్, మోహన్‌రావు, రవీంరద్, నర్సయ్య పాల్గొన్నారు.

## డిఇ ఆధ్వర్యంలో అధికారుల పర్యటనలు

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** శుక్రవారం డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో టీజీఎన్పిడీసీఎల్ (డీఈ) సారయ్య ఆధ్వర్యంలో విద్యుల్ బకాయిల వసూల్ల కేంద్రాల్లో అధికారులు ముమ్మరంగా పర్యటించి విద్యుత్ సిబ్బందికి బకాయిలు రాబట్టే పలు సూచనలు చేసారు.శివునిపల్లి విభాగంలోని ఇప్పగూడెం గ్రామంలో డీఈ పర్యటించి మాట్లాడుతూ పేరుకుపోయిన బకాయిలు రాబట్టేందుకు ఒక ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు.విద్యుత్ సరఫరాలలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో మండలాల పరిధిలోని ఏఈలఆయన వెంట ఏడీఈ పాల్వాయి రణధీర్, ఏఈ పి.శంకర్, సత్తయ్య, లైన్ ఇన్స్‌పెక్టర్ కాంతయ్య, సాయిబాబు, వెంకటేశ్వర్లు, సదన్, అశోక్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు, ఓటములు అనేవి ప్రజాస్వామ్యంలో సహజం

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో రఘునాథపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడినప్పటికీ ప్రజా సేవలోనే కొనసాగుతానని, ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు అనేవి సహజమేనని కాంగ్రెస్ నాయకురాలు నీలం వనమాల ఐలేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కుటుంబం కాంగ్రెస్ పార్టీలో కొన్నేళ్లుగా కొనసాగడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సర్పంచ్ ఎన్నికలలో ఓడినప్పటికీ తాను బాధపడడం లేదని, ఎన్నికలలో గెలుపు, ఓటములు సహజమేనని, ఓడించిన ప్రజలే మరోసారి గెలిపించడం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. సర్పంచ్ ఎన్నికలలో తనకు మద్దతు తెలిపిన ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సిఎం, ఎమ్మెల్యే నాయిని



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్:** మొంథా తుఫాన్ వరద వల్ల నష్టపోయిన వరంగల్ పశ్చిమ నియోజగవర్గ ప్రాంతాన్ని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కృషితో వరంగల్ పోతన నగర్ ప్రాంతాన్ని సందర్శించిన సి.ఎం.రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వరదల్లో నష్టపోయిన భాధితులకు ఒక్కో కుటుంబానికి 15,000రూపాయల నష్ట పరిహారం ప్రకటించి ఆ నగదు లబ్దిదారుల ఖాతాల్లో జమ అయిన సందర్భంగా రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ స్థానిక మైనార్టీ కాంగ్రెస్ నాయకుడు ఎం.డి సమద్ ఆధ్వర్యంలో పోతన నగర్ లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కటౌట్ కి పాలభిషేకం చేశారు. పోతన నగర్ లబ్దిదారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ 3సార్లు వరదలు వచ్చి నష్టపోయినాయి కానీ అప్పుడున్న బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వలేదని,కానీ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో అనుకోని సందర్భంలో వచ్చిన తుఫాన్ కు వరదల్లో నష్టపోయిన భాధితులకు నెల రేషన్ సరుకు 15,000 నష్ట పరిహారం ప్రకటించి ఇచ్చిన మాటను నిలబెట్టుక్కున్నారని సి. ఎం రేవంత్ రెడ్డికి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో 11వ, డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయ లక్ష్మి సురేందర్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గన్నారపు సంగీత్ కుమార్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గోల్కొండ సాంబయ్య, సిలువేరు కోటేశ్వర్,పులుగం సదానందం,గన్నారపు కమల్, లంక సతీష్, గడ్డం. రమేష్,రుద్ర మహేష్, అడుప. అరుణ్,బొల్లం. పవన్ పులుమాటి అశోక్, గజ్జి.రాజు ఇసంపెల్లి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఐద్వా జాతీయ మహాసభల సందర్భంగా జెండా ఆవిష్కరణ



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా 14వ జాతీయ మహాసభ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జెండా ఆవిష్కరణలు చేయాలని ఐద్వా జిల్ల కార్యదర్శి ఎండీ షబానా పిలుపునిచ్చారు. ఐద్వా వ్యవస్థాపకురాలు సుశీల గోపాలన్ 24వ వర్థంతి సందర్భంగా మండలంలోని ఐద్వా మండల కార్యదర్శి ఎండీ షబానా ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. సుశీల గోపాలన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా షబానా మాట్లాడుతూ నిత్య పోరాటశీలి సుశీల గోపాలన్ ఆమె ఒక ధైర్యం ఒక తెగింపు అని, అలుపెరుగని పోరాట యోధురాలు, నిత్య పోరాట శీలి అని తెలిపారు. 1981లో ఐద్వా వ్యవస్థాపకులలో ఆమె ఒకరన్నారు. తుదిశ్వాస విడిచే వరకు ఐద్వా ఉపాధ్యక్షురాలిగా సేవలందించారన్నారు. నాయకులు భారత, లక్ష్మ మ్మ, కోమల, రజిత, అక్షయ, చిన్ని పాల్గొన్నారు.

## కెయులో అంతర్ కళాశాలల అథ్లెటిక్ మీట్ ప్రారంభం



**ప్రజాపక్షం/కెయుక్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్ మీట్ ను కాకతీయ యూనివర్సిటీ మైదానంలో కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే ప్రతాప్ రెడ్డి జెండా ఊపి క్రీడలను ప్రారంభించడం జరిగింది. ఈ మీట్లో క్రీడాకారులు యూనివర్సిటీ పరిధిలో గల మూడు జిల్లాలలోని 36 కళాశాల నుండి 210 విద్యార్థినిల, 250 విద్యార్థులు పాల్గొనడం జరిగింది. శుక్రవారం జరిగిన పోటీలలో 1500 మీటర్స్, 400 మీటర్స్, 4×400 మీటర్స్ , రిలే 100 మీటర్స్, డిస్కస్ త్రో షార్ట్ పోర్ట్ హై జంప్ పోటీలు జరిగాయి. దీనికి ముఖ్య అతిథులుగా కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె ప్రతాపరెడ్డి, గౌరవ అతిథులుగా సెక్రటరీ ప్రొఫెసర్ వై వెంకయ్య, యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టీ మనోహర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపల్ భాస్కర్, అదేవిధంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈ నారాయణ, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ ఎన్. ఇస్తారి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సోమన్న, జనరల్ సెక్రటరీ డాక్టర్ కే సునీల్ రెడ్డి, అదేవిధంగా వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పోటీలకు ఆర్గనైన్ సెక్రటరీగా డాక్టర్ ఎస్ కుమారస్వామి వ్యవహరిస్తున్నారు. ఈ పోటీలు రెండు రోజులపాటు జరగనున్నాయని తెలపడం జరిగింది. ఈ పోటీలను ఉద్దేశిస్తూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె ప్రతాపరెడ్డి మాట్లాడుతూ మానవ జీవితంలో క్రీడలు తప్పనిసరని వారు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండి విద్యను అభ్యసించాలన్నారు. అదే విధంగా క్రీడలకు విచ్చేసినటువంటి క్రీడాకారులు అదేవిధంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారు భవిష్యత్తులో మంచి స్థానంలో ఉండాలని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కాకతీయ యూనివర్సిటీకి గుర్తింపు తీసుకురావాలన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరంను ప్రారంభించిన ఉపసర్పంచ్



**ప్రజాపక్షం/తరిగొప్పుల:** దామెర దేవదానం కమలమ్మ జ్ఞాపకార్థంగా 11వ వార్షికోత్సవ సందర్భంగా మండల కేంద్రంలోని సెంటనరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో విక్టర్ జేమ్స్, డేవిడ్ సమక్షంలో ఉచిత కంటి వైద్య శిబిరంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తరిగొప్పుల గ్రామ ఉప సర్పంచ్ చిలివేరు మహేందర్ హాజరై రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మహేందర్ మాట్లాడుతూ శరీరంలో అన్ని అవయవాలలో కన్ను చూపు ప్రధానమైనదని, ఉచిత కంటి చూపు వైద్య పరీక్షలు నిర్వహించడం చాలా గొప్ప కార్యక్రమమన్నారు. కార్యక్రమాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజేష్, ప్రేమ్ కుమార్, టోని (విజయ్), సంఘ కాపరి ప్రభాకర్, లుక, ప్రవీణ్, దేవదానం, మాజీ సర్పంచ్ ప్రభుదాస్, పౌలు, లుక, ఉదయ్‌కుమార్, కరుణాకర్, విజయ్, దాసు, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పండుగ కనకయ్య, రాములు, కిరణ్, పోషయ్య, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విరాళం అందజేత



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో కొలువైన శ్రీ శివ సీతారామాంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఆముదాల యాకమ్మ కీర్తిశేషులు ఆముదాల హనుమారెడ్డి దంపతుల కుమారులు ఆముదాల మల్లారెడ్డి, ఇంద్రారెడ్డిలు దేవాలయంలోని ధ్వజస్తంభం వద్దనున్న పంచముఖ హనుమాన్ విగ్రహంను(కృష్ణ శిల) దీనికి గాను రూ.65000లు విరాళంగా అందజేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవంతునికి సేవ చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బక్కెర సిద్దయ్య, మారోజు సత్యనారాయణ,సిద్దేశ్వర, కనకయ్య, రవి, నాగరాజు, చంద్రమౌళి, మోహన్‌రెడ్డి, నరేష్, రాములు, జయరాములు, పాల్గొన్నారు.

## బిఎన్ఆర్‌కె టౌన్ అధక్షులుగా రవి



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** బిఎన్ఆర్‌కె భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం టౌన్ అధ్యక్షులుగా కొల్లూరి రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులుగా ఇరుగు మహేందర్, ప్రధాన కార్యదర్శిగా గంధమల్ల నరేష్, సహాయ కార్యదర్శిగా అల్వాల్ రాజు, కోశాధికారిగా కుకుడాల పాండురంగం, ఆర్గనైజర్ గుడ్ల మనోహర్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. రవి మాట్లాడుతూ తనకు ఇచ్చినటువంటి భాధ్యతను సక్రమంగా నిర్వహించి కార్మికుల పక్షాన నిలబడి కార్మికుల అభివృద్ధి కోసం పోరాడుతానన్నారు.ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కేశయ్య, గంధమల్ల కిష్టయ్య, మురళి, సత్తయ్య, రవి కుమార్, నాగరాజ్, వెంకటేశం, బాలరాజ్, సంపత్, జంపయ్య, ఉపేందర్, వెంకటయ్య, కిషన్, పుల్లయ్య, నాగయ్యలు పాల్గొన్నారు.

## ఘనంగా ఐద్వా జాతీయ మహాసభలు




**ప్రజాపక్షం/జనగామ టౌన్:** ఐద్వా 14వ జాతీయ మహాసభల సందర్భంగా జెండా ఆవిష్కరణ ఐద్వా 14వ జాతీయ మహాసభల సందర్భంగా జిల్లా కేంద్రంలో స్థానిక ఆఫీస్‌లో జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె ఐద్వా వ్యవస్థాపకులలో ఒకరైన సుశీల గోపాలన్ 25వ వర్థంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు మనం అందించే నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యురాలు అనిత, పట్టణ అధ్యక్షురాలు రమాదేవి, వరలక్ష్మి , నాయకులు మమత, రేణుక, బాలమణి, సంపత్, విజయ, లక్ష్మి , అరుణ, పాల్గొన్నారు.

## కొత్తగూడలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్

**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ గంగారం కోమట్లగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబా నియంత్రణ పక్షోత్సవాల సందర్బంగా డిఎంహెచ్వో భూక్య రవి రాథోడ్ ఆధ్వర్యంలో పురుషులకు కుటుంబ నియంత్రణ ఎన్ఎస్‌వి ఆపరేషన్లు చేయడం జరిగింది. ఈసందర్బంగా డిఎంహెచ్వో భూక్య రవి రాథోడ్ మాట్లాడుతూ ఎక్కువ శాతం మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయడం జరుగుతుందని అయితే పురుషులలో ఈ ఆపరేషన్స్ వల్ల సమస్యలు ఏర్పడతాయని అపనమ్మకం వల్ల భయపడుతున్నారని ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ పురుషులకు ఉండవని అన్నారు. పురుషులు నిరంభ్యంతరంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవచ్చునని అన్నారు. ఈకార్యక్రమంలో పిఓఎంఎస్ ఎంసిఎచ్ సారంగపాణి ప్రత్యూష మురళీధర్ సిహెచ్ఓ సంపత్‌కుమార్ ప్రీతీ వెంకటేష్ అఖిల్ వైద్య సిబ్బంది పాల్గోన్నారు.

# 20 నుంచి యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం

ప్రజాపక్షం/మరిపెడ: రైతులకు యూరియాను సులభంగా, పారదర్శకంగా, క్యూలైన్ల ఇబ్బందులు లేకుండా చేసేందుకు మరియు సమయానికి అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ రైతుల కోసం ఈ నెల 20వ తేదీ నుంచి యూరియా బుకింగ్ యాప్ ప్రారంభించనున్నట్లు మరిపెడ ఏవో వీరా సింగ్ తెలిపారు. ఈ యాప్ ద్వారా రైతులు స్వయంగా రైతు బదులుగా ఎవరైనా యూరియాను బుక్ చేసుకునే సదుపాయం కల్పించబడిందని, యూరియా బుకింగ్ సమయంలో పట్టా పాస్ బుక్ లింక్ అయిన మొబైల్ నెంబర్ కు ఓటిపివస్తుంది. ఆఓటిపి ఆధారంగా యూరియా బుకింగ్ ప్రక్రియ పూర్తి చేయబడుతుంది అని తెలిపారు. రైతులు తమకు అందుబాటులో ఉన్న సమీప అధీకృత ఎరువుల డీలర్స్ ఎంపిక చేసుకుని యూరియా బుక్ చేసుకునే సౌకర్యం ఈ యాప్ లో చూపెడుతుంది. బుక్ చేసుకున్న యూరియాను 24 గంటల లోపు తీసుకుని వెళ్లాలి, ఏదైనా కారణంతో తీసుకోకపోతే మళ్ళీ బుక్ చేసుకొని తీసుకోవచ్చన్నారు. భూమి విస్తీర్ణం ఆధారంగా రైతులకు యూరియా జారీ చేయబడుతుంది. ఈ యాప్ ద్వారా పట్టా పాస్ బుక్ కలిగిన రైతులు, ఆర్ ఓ ఎఫ్ ఆర్ పాస్ బుక్ కలిగిన రైతులు, పట్టా పాస్ బుక్ లేని రైతులు (సంబంధిత ఏఇవో ను సంప్రదించి) కౌలు రైతులు యూరియాను బుక్ చేసుకునే అవకాశం కల్పించబడిందని ఏఓ తెలిపారు. రైతులు తమ పంట నమోదు కూడా ఇందులో పొందుపరచుకొనే అవకాశం ఉందని, ఆ సమాచారం తదుపరి పంట కొనుగోలు చేసే సమయాన ఉపయోగపడుతుంది కాబట్టి జాగ్రత్త గా నమోదు చేసుకోవాలి. భూమి విస్తీర్ణాన్ని అనుసరించి ప్రతి 15 రోజుల వ్యవధిలో విడతల వారీగా యూరియా బుకింగ్ చేసుకునే విధానం అమలులో ఉంటుందని, ఈ క్రమంలో యూరియా సరఫరాలో అంతరాయం లేకుండా ఉండటంతో పాటు, అక్రమ నిల్వలు మరియు దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయబడుతుందని ఆయన తెలిపారు. రైతులు సహకరించి ఈ యూరియా బుకింగ్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని ఏవో వీరా సింగ్ తెలిపారు.

# నాల్గవ వార్డు సభ్యునికి మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం

ప్రజాపక్షం/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 4 వ వార్డు అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన రహీమాబాబాకు కాళేశ్వరంలోని జామా మజీదులో శుక్రవారం ముస్లిం సోదరులు శాలువాతో సన్మానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ఇసుక క్వారీలో అక్రమ వసూళ్లు

ప్రజాపక్షం/మహాదేవపూర్: మండలంలోని ఎల్కేశ్వరం ఇసుక క్వారీలో నిర్వాహకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని బోమ్మాపూర్ గ్రామస్థుడు భరత్ రెడ్డి శుక్రవారం ప్రకటనలో ఆరోపించారు. ఇసుక క్వారీకి వస్తున్న ఒక్కో లారీ కి 3 వేల రూపాయలు వసూలు చేస్తూ రోజూ వందల సంఖ్యలో వస్తున్న లారీల ద్వారా లక్షల రూపాయలు వసూలు చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని తెలిపారు. లారీ యజమానులు, డ్రైవర్లను బ్బందులకు గురి చేస్తూ వసూళ్లకు పల్పడుతున్నారని లేదంటే భయభ్రాంతులకు గురి చేస్తున్నాని తెలిపారు.అధికారులు స్పందించి క్వారీ యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

# అగ్నివీర్‌కు ఎంపికైన యువకులకు సన్మానం



కేసముద్రం/ప్రజాపక్షం: కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామం నుండి అగ్నివీర్‌కి ఎంపికై శిక్షణను పూర్తి చేసుకుని జనవరిలో జమ్మూకాశ్మీర్ లధక్‌లో మొదటి సారి విధులు నిర్వర్తించడానికి వెళ్తున్న నాగరాజు ప్రదీప్, గై ప్రశాంత్ లను లయన్స్‌క్లబ్ కేసముద్రం కోశాధికారి రాపోలు శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామంలోని ఉన్నత పాఠశాలలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గ్రామ సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి మాట్లాడుతూ గ్రామంలోని యువత వీరిని ఆదర్శంగా తీసుకొని సన్మార్గంలో నడవాలని, ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు, సంఘ, చట్ట వ్యతిరేక చర్యలకు దూరంగా ఉండాలని, గ్రామంలోని యువత తీర్చిదిద్దేలా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, పాస్ట్ జడ్పీ ఎర్రం శ్రీరాములు, బోగోజు నాగేశ్వరాచారి, కరివేదుల క్రిష్టారెడ్డి, చింత కర్ణాకర్, పరాంకుశం శ్రీహరి, రుద్ర శ్రీకాంత్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నాడు సతి.. నేడు పతి



ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దుబ్బగూడెం గ్రామ ప్రజలు రెండు పర్యాయాలు దంపతులకు సర్పంచ్ పదవిని కట్టబెట్టి ప్రజలు తమ విశ్వాసాన్ని చాటారు.వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దుబ్బగూడెం గ్రామపంచాయతీ 2023 ఎన్నికల్లో విజయం సాధించి ప్రజల మన్ననలు పొందిన ధరావత్ సరితాబాయ్ బాలాజీ 2025వరకు సర్పంచ్ పదవిలో ఉంటూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో గ్రామానికి రావలసిన పిధులు అన్నిటిని సద్వినియోగం చేస్తూ గ్రామ ప్రజల విశ్వాసాన్ని చురగొన్నారు.అయితే 2025 గ్రామపచాయతీ ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అదే కుటుంబంపై నమ్మకం ఉంచి మళ్లీ సిట్ ఇవ్వగా ఈసారి ధరావత్ సరితాబాయ్ భర్త బాలాజీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి దుబ్బగూడెం గ్రామపంచాయతీ సర్పంచిగా ఘన విజయం సాధించారు.దీంతో ఒకే కుటుంబానికి రెండు పర్యాయాలు సర్పంచ్ పదవి కట్టబెట్టిన ప్రజలు వారిపై నమ్మకం పెట్టుకున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

**ఎమ్మెల్యే సీనియర్ నాయకులు మాధవ పెద్ది రమేష్‌చందర్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ది చేస్తా: దుబ్బగూడెం నూతన సర్పంచ్ బాలాజీ**

గత2023వ సంవత్సరంలో దుబ్బగూడెం గ్రామ ప్రజలు తమ కుటుంబంపై విశ్వాసం పెట్టి నాడు నా భార్యను సర్పంచ్‌గా గెలిపించారని నాటి మొదలుకొని నేటి వరకు గ్రామానికి అన్ని విధాలుగా సహకారాన్ని అందిస్తున్నానని అన్నారు.అయితే ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం తనకు అవకాశం ఇచ్చిందని మళ్లీ దుబ్బగూడెం గ్రామ ప్రజలు తనను విశ్వసించి సర్పంచ్‌గా గెలిపించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా తనకు తన కుటుంబానికి రెండు మార్లు అవకాశం ఇచ్చిన దుబ్బగూడెం గ్రామ ప్రజలకు తనకు సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మురళి నాయక్ సీనియర్ నాయకులు రమేష్‌చందర్‌రెడ్డికి అయన ధన్యవాదాలు తెలిపారు.

## పదో తరగతి విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ



ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మట్టెవాడ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు జిల్లా న్యాయవాది వాసం ఆనంద్‌కుమార్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు వాసం సారంగపాణి అధ్యక్షతన జరగగా ముఖ్యఅతిథిగా మానుకోట జిల్లా న్యాయవాది వాసం ఆనంద్‌కుమార్ హాజరై మాట్లాడారు ప్రతి సంవత్సరం 10వ తరగతి విద్యార్థులకు రీడింగ్ మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందని అందులో బాగంగా ఈసంవత్సరం కూడా పుస్తకాలను పంపిణి చేయడం జరిగిందని అన్నారు. ఈఅవకాశాన్ని ప్రతి ఒక్క విద్యార్థి ఉపయోగించుకోని 100/శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. మారుముల గ్రామంలో ఈపాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులకు తల్లిదండ్రులకు అదేవిధంగా ఉపాధ్యాయులకు ఉందని ఆయన గుర్తు చేశారు.సమాజ మార్పు విద్యతోనే సాధ్యమని కాబట్టి ప్రతి కుటుంబం విద్య విషయంలో జాగ్రత్త తీసుకొవాలని సూచించారు.ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు వాసం వీరస్వామి పాఠశాల ఉపాధ్యాయులు పెనుక శ్యామల శ్రీకాంత్ పూల్‌సింగ్ వెంకన్న శ్రీరాములు రవి యూత్ సభ్యులు సోలం ప్రవీణ్ ఈసం మహేష్ ఎట్టి విద్యార్థులు పాల్గొన్నారు

# మహాత్మాగాంధీ పేరు తొలగించడం సరికాదు

ప్రజాపక్షం/ములుగు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం స్థానంలో కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన వికసిత్ భారత్..గ్యారంటీ ఫర్ రోజ్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ బిల్లు 2025ను రద్దు చేయాలని సిపిఎం వెంకటాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తాళ్లపహాడ్ సెంటర్‌లో బిల్లు ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రత్నం రాజేందర్ మాట్లాడుతూ పని చేసే హక్కును కల్పించాలన్న సార్వత్రిక డిమాండ్ ఆధారిత చట్టమైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను రద్దు చేసి దాని స్థానంలో తీసుకువచ్చిన జిరామ్‌జి బిల్లు ప్రభుత్వ పథకంగా మాత్రమే ఉంటుందని అన్నారు. చట్టబద్ధమైన హక్కులు కార్మికులు కోల్పోతారని అన్నారు. ఈ బిల్లులో పని డిమాండ్‌కు తగతిన ట్లుగా నిధులను కేటాయించాల్సిన బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకుంటుందన్నారు. వ్యవసాయ పనులు ఉధృతంగా ఉన్న సమయంలో 60 రోజుల వరకు ఉపాధిని సస్పెండ్ చేసేందుకు ప్రభుత్వాలకు అనుమతిస్తున్న నిబంధనల వలన అత్యంత అవసరమైన కాలంలో గ్రామీణ కుటుబాలకు పనులు నిరాకరిస్తూ, వారు భూస్వాములపై ఆధారపడాల్సిన పరిస్థితి తలెత్తుతుందని అన్నారు. పని ప్రదేశాల్లో డిజిటల్ హాజరును తప్పనిసరి చేయడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అలువాల ఐలయ్య, పసుల కోటయ్య, నీలం కొమురయ్య, ఎనబోతుల సాంబయ్య, కన్నెవేన దేవేందర్, పాల్గొన్నారు.

# ఓహ్ చిత్రాన్ని ఆదరించండి

ప్రజాపక్షం/తొర్రూరు : తాను తొర్రూరు నుంచి వరంగల్ ప్రాంతం నుండి సినిమా ఇండస్ట్రీకి వెళ్లి 'ఓహ్' చిత్రంలో హీరోగా, రచయితగా ప్రేక్షకుల ముందుకు వచ్చానని 'ఓహ్' చిత్రాన్ని చూసి ఆదరించాలని హీరో రఘురామ్ అన్నారు. తాను హీరోగా నటించిన 'ఓహ్' చిత్రాన్ని కాశ్మీర్, కులు, మనాలి, ఢిల్లీ, తాజ్‌మహల్, హైదరాబాద్ వంటి అద్భుతమైన ప్రదేశాల్లో చిత్రీకరించడం జరిగిందని తెలిపారు. ఈ సినిమాలో శృతిశెట్టి, నైనా పాఠక్ హీరోయిన్లుగా నటించారని, ఏకిరి సత్యనారాయణ ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు నిర్మాతగా వ్యవహరించారని చెప్పారు. ఈ సినిమాకు కథ, కథనం, మాటలు అందించడం జరిగిందని హీరో రఘురామ్ తెలిపారు. మన ఊరి పేరును తెలుగు సినీ పరిశ్రమలో నిలబెడుతానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు చేస్తూ మన ప్రాంత కళాకారులకు అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. 'ఓహ్' చిత్రాన్ని ప్రతి ఒక్కరూ చూసి ఆదరించాలని కోరారు.

# ఆల్ ఇండియా బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ప్రజాపక్షం/తొర్రూరు : ఆల్ ఇండియా బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా తొర్రూరుకు చెందిన పాలిశెట్టి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసరావు గతంలో రాష్ట్ర హ్యూమన్ రైట్స్ ఫర్ సోషల్ సర్వీస్ జిల్లా అధ్యక్షునిగా పని చేశారు. ఆటో యూనియన్, సాంస్కృతిక విభాగాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. గత కొంతకాలంగా బీసీలకు దక్కాల్సిన హక్కులు, రిజర్వేషన్లపై జరుగుతున్న పోరాటాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. బీసీ సమాజాన్ని చైతన్య పర్చేందుకు ఉత్సాహంగా పని చేస్తున్న శ్రీనివాసరావును గుర్తించి బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నిర్మాణ బాధ్యతలను అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పదవి బీసీ సమాజ సంక్షేమం కోసం అంకితం చేస్తున్నానని అన్నారు. బీసీల సమస్యలపై చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. పదవి రావడానికి కృషి చేసిన జాతీయ, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# గుండెపోటుతో అకస్మాత్తుగా యువకుడి మృతి

ప్రజాపక్షం/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం గ్రామానికి చెందిన దూది రాకేష్ అనే యువకుడు (36) గురువారం అర్ధరాత్రి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందారు. దినసరి ఉపాధితో కుటుంబాన్ని పోషించుకుంటున్న రాకేష్ అకాల మరణం పట్ల గ్రామంలో తీవ్ర దిగ్భ్రాంతికి గురి కాగా కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతంతో శోకసంద్రంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి రాకేష్‌కు అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి,శ్వాస సమస్య తలెత్తడంతో తీవ్ర అస్వస్థతకు గురి కాగా పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను భూపాలపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు నిర్ధారించారు.రాకేష్ స్నేహశీలి, కష్టపడే స్వభావం కలిగిన వ్యక్తిగా గ్రామంలో అందరికీ సుపరిచితుడు. గత 25 రోజులుగా మృతుడు రాకేష్ తో పాటు ఆయన 7 సంవత్సరాల చిన్నారి కూతురు అయ్యప్ప మాలాధారణ దీక్ష లో కొనసాగుతుండగా రాకేష్ అకాల మరణం కుటుంబంలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. రాకేష్ మృతి వార్తతో స్థానికంగా విషాదఛాయలు అలుముకోగా మృతుడు రాకేష్ ఆత్మకు శాంతి చేకూర్చి, ఆయన లేని లోటు కుటుంబానికి ప్రసాదించాలని గ్రామ పెద్దలు,ప్రజలు ప్రార్థించారు.

# కుట్ర రాజకియాలకు పాల్పడినా ప్రజలు అండగా నిలిచారు

ప్రజాపక్షం/మహాదేవపూర్: కుట్ర రాజకియాలకు పాల్పడినా గ్రామ ప్రజలు అండగా నిలిచి ఆదరించారని బిఆర్ఎస్ నాయకురాలు కేదారి గీతా బాయి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు.ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని ఆదరించి ఓట్లు వేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.బీసీ బిడ్డగా ఎన్నికల బరిలో నిలిచిన తనను అగ్రకుల నాయకులు కుట్ర రాజకియాలు ప్రజలను తెలియజేయాలని తలచుకున్నారని తెలిపారు.తన పార్టీ ఓట్లను చీల్చడానికి అధికార పార్టీ తరుపున ఇద్దరు అభ్యర్థులను బరిలో ఉంచి కుట్ర పన్నిన విషయం గమనించలేకపోయానని ఆవేదన వ్యక్తం చేసారు.అమినా గ్రామ ప్రజలు అండగా నిలిచి ఆదరించారని తెలిపారు.కుట్రలు ఎంతో కాలం సాగవని ప్రజలు తెలుసుకునే రోజులు వస్తాయని తెలిపారు.ప్రజా తీర్పును శిరసా వహిస్తానని పేర్కొన్నారు.

# విద్యార్థి దశ నుంచే... సమాజ సేవ, దేశభక్తి అలవర్చుకోవాలి

## గ్రామీణ విద్యార్థులకు చక్కటి భవిష్యత్తు

## ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్:**విద్యార్థి దశ నుండే విద్యార్థులు సమాజ సేవ, ఆరోగ్యం, దేశభక్తి అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజ్ఞాపూర్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో స్పోర్ట్స్ మీట్ ను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుధారాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు క్రమశిక్షణ, నైపుణ్యం, విలువలతో కూడిన



విద్యను పొందాలని ఆకాంక్షించారు. అలాగే మంచి అలవాట్లతో ఎదిగి, తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలని కోరారు. రాంష్ట్రలోని ప్రతి రెసిడెన్షియల్ విద్యార్థిపై ప్రభుత్వం రూ. లక్షా 25 వేలు ఖర్చు చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యతోపాటు వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తూ విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ క్రీడా పోటీల్లో గురుకుల విద్యార్థులు చక్కటి ప్రతిభ చాటి క్రీడా స్ఫూర్తిని చాటాలని వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మతిన్, మాజీ కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, మహమ్మద్ సమీర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, నక్క రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్‌పై ఫర్టిలైజర్ డీలర్లకు అవగాహన



**ప్రజాపక్షం/నిజాంపేట్:**నిజాంపేట మండల కేంద్రంలో స్థానిక రైతు వేదికలో వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి ఆధ్వర్యంలో కొనుగోలు పై నూతన యాప్ సంబంధించిన వివరాలను తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు యూరియా కొనుగోలుపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన యాప్ ను తీసుకురావడం జరిగిందని ఈ యాప్ ఆధారంగా డీలర్ రైతులకు యూరియా విక్రయించాలని తెలిపారు. రైతులు ఆన్లైన్లోనే యూరియా కొనుగోలు చేయాలని ఒక్కో రైతు ఒక ఎకరానికి మూడు బ్యాగుల చొప్పున బుకింగ్ చేసుకో బుకింగ్ చేసుకోవచ్చని ఒక రైతు బుకింగ్ రోజు నుంచి మళ్లీ 15 రోజుల తర్వాతనే బుకింగ్ అయ్యే అవకాశం ఉంటుందని బుకింగ్ అయిన 24 గంటల్లో యూరియా డెలివరీ చేసుకోవాలని తెలిపారు. రైతులు ఈ యాప్ ద్వారా యూరియా కొనుగోలును సమర్థవంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లు శ్రీలత, మౌనిక, రమ్య, ఫర్టిలైజర్ షాప్ ఓనర్లు శ్రీనివాస్, రంజిత్ రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన చల్మెడ ఉప సర్పంచ్

**ప్రజాపక్షం/నిజాంపేట్:**మండల పరిధిలోని చల్మెడ గ్రామ ఏడవ వార్డు మెంబరుగా గెలిచి ఉప సర్పంచ్ పదవి స్వీకరించిన ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఆకుల మహేందర్ శుక్రవారం మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఆకుల మహేందర్ కు మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ఆకుల మహేందర్ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలి అంటే కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమవుతుందని, అందుకే పార్టీలో చేరానని ఆయన తెలిపారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో చల్మెడ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొమ్మన మల్లేశం, చెప్పట ముత్యం రెడ్డి, సరాఫ్ యాదగిరి అక్కపల్లి రామ్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, సంగేపు నారాయణ, బాజ రమేష్, బాజా పెంటయ్య, బురాని చంద్రకళ, వార్డు మెంబర్లు రజని, విజయ , శ్యామల, పరుశరాములు,సామి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

# 40 శాతం సర్పంచ్ స్థానాలను దక్కించుకున్నాం

**ప్రజాపక్షం/గజ్వేల్:**పచ్చి అబద్దాలు చెప్పడంలో సీఎం రేవంత్ రెడ్డికి ఎవరూ సాటిరారని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శిస్తూ ఆయనకు ఆస్కార్, నోబెల్ అవార్డులు ఇవ్వాలని ఎద్దేవా చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కొడకండ్లలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో, గజ్వేల్ లో కెసిఆర్ చరిష్మాకు ఎదురులేదని, 40 శాతం సర్పంచ్ స్థానాలను బిఆర్ఎస్ పార్టీ దక్కించుకొని సత్తా చాటిందని తెలిపారు. రాష్ట్రంలో రోజురోజుకు తన గ్రాఫ్ పడిపోతుండడంతో సీఎం రేవంత్ రెడ్డి ఆందోళనతో జూటాకోర్ మాటలు మాట్లాడుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరి సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయగా, అందుకు భిన్నంగా వారు తమ పార్టీలో చేరలేదని సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. యూరియా, రుణమాఫీ, రైతుబంధు, పెన్షన్లు ఎగ్గొట్టిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పగా, ఇచ్చిన హామీల్లో భాగంగా



మహిళలు, వృద్ధులు, వికలాంగులకు బాకీపడిన డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులు అద్వాన్నంగా మారాయని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించి సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలు చేస్తూ సర్పంచ్ ఎన్నికల్లో డబ్బులు వెదజల్లినట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతు రుణమాఫీ కాకపోవడంతో అన్నదాతలు బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా మారగా, వారి సిబిల్ స్కోర్ పడిపోయి బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో 92 సర్పంచ్ స్థానాలను దక్కించుకోగా, తామే ముందున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం సిగ్గుచేటని వివరించారు.

# గ్రామ పాలకవర్గాన్ని సన్మానించిన డిసిసి అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి



**ప్రజాపక్షం/మనోహరాబాద్:**మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామ నూతన సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్,ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ లు పాలకవర్గ సభ్యులతో కలిసి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, సిద్దిపేట్ డిసిసి అధ్యక్షురాలు తూముకుంట ఆంక్ష రెడ్డి లను గజ్వేల్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన పాలకవర్గ సభ్యులను అంక్ష రెడ్డి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ప్రభుత్వ సహకారంతో గ్రామాల అభివృద్ధిలో పోటీ పడుతూ పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ తుమ్మల రాజు యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జున్నోజి నరసింహ చారి, ఎరుకల నరసింహ, ఎర్ర వెంకటేష్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ వార్డ్ సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/పాపన్నపేట:**పాపన్నపేట్ మండలం లోని 132KV మిన్పూర్ సబ్‌స్టేషన్ లో అత్యవసర మరమ్మతుల కారణంగా శనివారం నాడు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడిఈ వెంకటేశ్వరరావు, ఏఈ నర్సింలు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని గ్రామాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యానం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

# విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:**ప్రభుత్వ జూనియర్ కళాశాల అల్లాదుర్గంలో మధ్యాహ్న భోజనం ప్రిన్సిపాల్ సహకారంతో స్వచ్ఛందంగా విద్యార్థుల కొరకు ప్రతిరోజు మధ్యాహ్న భోజనాన్ని అందించే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ మధ్యాహ్న భోజన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ కె సత్తయ్య తన వచ్చిన మొదటి నెల వేతనాన్ని స్వచ్ఛందంగా పేద విద్యార్థుల కోసం 97,770 రూపాయలు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కొరకు అందజేశారు. ఈ కార్యక్రమానికి నడిపించుట తన వంతు సాయంగా అధ్యాపకులు శ్యామరావు 5000, స్థానిక అధికార, అనదికరా సభ్యులు సహకారం అందిస్తున్నారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పేద విద్యార్థులు రవాణా సౌకర్యాలు సరిగా లేకపోవడం వలన ఉదయము ఉపవాసము వచ్చి సరియైన విద్యను పొందటం లేదని గ్రహించడం జరిగిందన్నారు. విద్యార్థులు కడుపునిండా భోజనం తింటేనే చదువుకున్న విద్య అవగాహన అవుతుందని తెలిపారు. అందుకు తన వంతుగా మధ్యాహ్న



భోజనం విద్యార్థుల కొరకు అధ్యాపకుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో వంట వండటానికి కార్యాలయ సిబ్బంది హేమలత ముందుకు వచ్చారు. గత మాసంలో ప్రారంభించిన రాగి జావా ఉపహార కార్యక్రమం విద్యార్థుల కోసం కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమల నిర్వహణ కు సహకారం అందిస్తున్న స్థానిక అధికార, అనాదికరులకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తుకారాం, శ్యామ్ రావు, రవికుమార్, రవీందర్, నరసింహారెడ్డి, ప్రవీణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధియే లక్ష్యంగా పనిచేయాలి

**ప్రజాపక్షం/శివ్వంపేట:** నూతనంగా గెలుపొందిన సర్పంచ్‌లు అందరు గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా గ్రంధాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడ్‌లు అన్నారు. శుక్రవారం శివ్వంపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేసిన కాంగ్రెస్ మండలాధ్యక్షులు కొడకంచి సుదర్శన్‌గౌడ్, ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్‌తో పాటు పలువురిని అభినందించారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**ప్రజాపక్షం/సంగారెడ్డి:**సైబర్ నేరాల నుండి ప్రజలకు విముక్తి కల్పించాలని పోలీసు శాఖ చేస్తున్న విస్తృత ప్రయత్నంలో భాగంగా శుక్రవారం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే వివిద రకాల ఆన్లైన్ మోసాలను సూచించే పోస్టర్లను జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ ఆవిష్కరించారు. ఆకర్షనీయణమైన ప్రకటనలో తక్కువ పెట్టుబడి తో అధిక లాభాలు వస్తాయని నమ్మిస్తూ సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. డిజిటల్ ఆరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు అప్రమతగా ఉండాలని ఏ పోలీసు అధికారి కూడా నేరుగా వీడియో కాల్స్ చేయరని అసలు డిజిటల్ అరెస్ట్ అనేది లేదు అని గుర్తించాలని అన్నారు. నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్లను వెబ్‌సైట్లు రూపొందించి తక్కువ పెట్టుబడితో అధిక లాబాలు వస్తాయని చెపుతూ వాట్సప్ టెలిగ్రామ్ ,ఫెస్‌బుక్, ద్వార లింకులు పంపి మోసపూరితమైన వాగ్దానాలతో ఆన్లైన్ మోసాలకు పాల్పడుతున్నారు అన్నారు. సైబర్ నేరస్తులు పన్నిన మోసపూరిత ఆపర్లను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోను నమ్మవద్దని అనుమానాస్పద కాల్స్ ,లింకులు ఎదురైతే వెంటన్ సైబర్ క్రైమ్ హెల్ప్ నంబర్ 1930 కాల్ చేయాలని వెబ్ సైట్‌లో పిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్‌రావు, ఇన్స్‌పెక్టర్స్ రవి సదా నాగరాజు, సైబర్ సెల్ సిబ్బంది ఉన్నారు.



# మిన్పూర్ సర్పంచ్ సన్మానించిన మాజీ డిప్యూటీ స్పీకర్

**ప్రజాపక్షం/పాపన్నపేట:**మండల పరిధిలోని మిన్పూర్ గ్రామం నుండి మొదటి విడత సర్పంచ్ ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఆగం సృజన ఉప సర్పంచ్ కిరణ్. వార్డు సభ్యులను ను మాజీ డిప్యూటీ స్పీకర్ మెదక్ జిల్లా బీ ఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. శుక్రవారం మాజీ ఎంపీటీసీల పోరం. మండల అధ్యక్షుడు కుబేరుడు, మాజీ సర్పంచ్ లింగారెడ్డి ఆధ్వర్యంలో మిన్పూర్ నుండి ముఖ్య కార్యకర్తలతో కలిసి హైదరాబాదులోని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి స్వగృహానికి వెళ్లారు. అక్కడ ఆమె చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ ఆగం సృజన, ఉప సర్పంచ్ హనుమంతు కిరణ్ వార్డు సభ్యులు చాకలి మహేశ్వరి, ఎరుపుల బాబు, ఎల్లంపల్లి గంగవ్వ, బత్తిని మౌనిక, చిన్నపాపని పావని, సాయబుగారి కిరణ్, చిన్నం సాయిలు, దూదేకుల అబేద్ హుస్సేన్, హన్మంతు కిరణ్, భూమామ్మోళ్ల మల్లయ్య . శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మెదక్ నియోజకవర్గం ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతి రెడ్డి కూడా వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

## విపత్తుల నిర్వహణ సన్నద్ధతపై..

# 22న ప్రయోగాత్మకంగా మాక్ ఎక్సర్‌సైజ్

జిల్లా కలెక్టర పి.ప్రావీణ్య



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎలా ఎదుర్కొవాలనే అంశాలపై ఈనెల 22వ తేదిన జిల్లాలో ప్రయోగాత్మక రీతిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న లేబుల్ టాప్ (మాక్) ఎక్సర్‌సైజ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత శాఖల అదికారులను ఆదేశించారు. పారిశ్రామిక ప్రమాదాలు, వరదలు, విపత్తులు సంభవించిన సమయాలలో ప్రాణ నష్టం, ఆస్తినష్టం, నివారించేందుకు చేపట్టాల్సిన తక్షణ చర్యలపై సన్నద్ధతను పెంపొందించేందుకు వీలుగా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ నేషనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ ఆథారిటీ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22న అన్ని జిల్లాలలో మాక్ ఎక్సర్ సైజ్ నునిర్వహించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని టీజీఐసిసిసి నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి రామకృష్ణరావు ఎస్‌డిఎం మేజర్ సుదీర్ ఫైర్ సర్వసెస్ డైరెక్టర్ జనరల్ హసనైన్ తెలంగాణ ఫైర్ సర్వీస్ డైరెక్టర్ నారాయణరావు ,రెవన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ ఇతర ఉన్నత అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు ఎస్పీలు సంబందిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాక్ ఎక్సర్ సైజ్ చేట్టాల్సిన అవశ్యకత గురించి తెలియజేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎస్ జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాదికారులు దిశా నిర్దేశ చేశారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాలలో అనుకొని ప్రమాదాలు సంబిస్తే అవసరమైన సహాయక చర్యలు చేపట్టడానికి పరిశ్రమ శాఖ అగ్ని మాపక శాఖ వైద్య ఆరోగ్య శాఖ ,రెవెన్యూశాఖ , పోలీస్ యంత్రాంగంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జిల్లాలోని భారీ మద్యతర, సూక్ష్మ పరిశ్రమలలో ఆయా పరిశ్రమల స్థాయిలకు అనుగుణంగా భద్రతా ప్రమాణాలు పాటించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పరిశ్రమలలో ప్రమాదాల నివారణ కోసం తరుచు అధికారులు బృందాలు పరిశ్రమలను తనిఖీ చేస్తూ అవసరమైన భద్రతా ప్రమాణాలు పరిశ్రమంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు ప్రారంభించి ఆస్తి ,ప్రాణ నష్టాలు జరుగకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు పారిశ్రామిక ప్రాంతాలలో చేపట్టినట్లు తెలిపారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు తక్షణ సహాయక చర్యలు చేపట్టడం అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచడం రెస్క్యూ టీంలు మెడికల్ టీంలను ఏర్పాటు చేయడంం ఇతర సహాయక చర్యలను యుద్ధ ప్రాతిపాదికన చేపట్టినట్లు తెలిపారు. విపత్తులు సంభవించిన సమయంలో సమర్థవంతంగ ఎదుర్కొనేలా అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని కలెక్టర్ తెలిపారు. వీడియ కాన్సరెన్స్ అనంతరం కలెక్టర్ విపత్తుల నిర్వహణపై చేపట్టనున్న మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమం ఏర్పాట్లపై జిల్లా అదికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 22వ తేది నాటి మాక్ ఎక్సర్ సైజ్ సందర్భంగా ఈ తరహా అన్ని చర్యలు ప్రయోగాత్మకంగా చేపట్టేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మాదురి, జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్, ఎస్పీ రఘునందన్‌రావు ,జిఎం డిఐసి తుల్జా నాయక్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగశ్వరరావు, డిటీఓ అరుణ, కలెక్టర్ విపత్తుల నిర్వహణ విభాగం పర్యవేక్షకుడు లింగ శేఖర్, ఇరిగేషన్ రెవెన్యూ ఆర్ అండ్ బి పంచాయతీరాజ్, వైద్యారోగ్య పోలీస్ ,మున్సిపల్ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## అధైర్యపడవద్దు.. అండగా ఉంటాం

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

పైతన సాయికుమార్

**ప్రజాఫక్షం/మునిపల్లి :** అధైర్యపడవద్దు మేము అండగా ఉంటామని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పైతన సాయికుమార్ భరోసా నిచ్చారు. మునిపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన మున్నూరు నాగన్న స్వల్ప ఓట్లతో ఓటమి చెదడం పట్ల ఆదైర్య పడవలదని పార్టీ వాలం అందరం అండగా ఉంటామని పైతర సాయి కుమార్ భరోసానిచ్చారు. ఇబ్రహీంపూర్ గ్రామ వార్డు సభ్యులుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలియజేసి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తుడుము దుర్గయ్య, నాయకులు గులా మోద్దీన్ శేఖర్, వార్డు సభ్యులు బోయిని పార్వతమ్మ, ఎల్ కరుణమ్మ, సుదాకర్ గౌడ్ లు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలి

68 మంది సర్పంచ్లకే

కాంగ్రెస్‌ను పరిమితం చేశాం

వంటేరు ప్రతాప్ రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్ :** గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్‌లను 68 మందికి పరిమితం చేయగా, అందుకు భిన్నంగా మెజార్టీ పొందినట్లు మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి ఇక్కడి ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గజ్వేల్ లో కెసిఆర్‌కు ఎదురులేదని, తప్పుడు సమాచారంతో అబద్ధాలు మాట్లాడడం మానుకొని రేవంత్ రెడ్డి పాలనపై దృష్టి పెట్టాలని కోరారు. బిఆర్ ఎస్ మద్దతు సర్పంచ్లను సిఎం ఎక్కడికి తెమ్మని చెప్పినా తెచ్చి లెక్క చెప్తామని అన్నారు. 179 స్థానాలకు గాను బిఆర్ఎస్ 92 స్థానాలను గెలిచిందని, కాంగ్రెస్ పార్టీ 68, బిజెపి 5, ఇతరులు 14 స్థానాలు దక్కించుకున్నట్లు తెలిపారు. గజ్వేల్ కాంగ్రెస్ లీడర్ల అబద్ధాలు నమ్మి మీడియా ముఖంగా చెప్పడం సీఎం స్థాయిని దిగజార్చిందని స్పష్టం చేశారు. మేజర్ పంచాయతీలు, అన్ని మండల కేంద్రాల్లో బిఆర్ఎస్ పాగా వేసినట్లు గుర్తు చేశారు. రాజకీయ లబ్ధి, ఉనికి కోసం గజ్వేల్ కాంగ్రెస్ లీడర్లు రేవంత్ రెడ్డి మెప్పు కోసం అడ్డదారులు తొక్కుతున్నట్లు చెప్పారు. పంచాయతీ నిధులు ప్రతి ఊరికి వస్తాయని, నిధుల అడ్డుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల కాదని నిలదీశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైనట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసిలు అనంతుల ప్రశాంత్, రామచంద్రం నేతలు ప్రతాప్ రెడ్డి, ఖాజా విరాసత్ అలీ, మద్ది రాజిరెడ్డి, హైదర్ పటేల్, ఆకుల దేవేందర్, రఘుపతి రెడ్డి, పాల రమేష్ గౌడ్, ఉమర్, అహ్మద్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల కేంద్రానికి చెందిన బండారి రాజయ్య గత ఐదు రోజుల క్రితం మృతి చెందడం జరిగింది. అట్టి విషయం తెలుసుకున్న నిజాంపేట నూతన సర్పంచ్ చల్మేటి నరేందర్ మృతుని కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం రోజున అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గెరిగంటి బాబు, పప్పుల సిద్ధరాంరెడ్డి, కొమ్మాట సుధాకర్, వార్డు సభ్యులు టంకరి ప్రశాంత్ ,చల్మేటి ప్రసాద్ , జాల పోశయ్య ,మేకల రమేష్ పాల్గొన్నారు.





## కొర్వి కృష్ణస్వామి ఆశయాల సాధనకు కృషి చేద్దాం

నీలం మధు ముదిరాజ్

**ప్రజాఫక్షం/పటాన్‌చెరు :** బడుగుల ముద్దబిడ్డ మహానేత కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం చిట్కుల్లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నీలం మదు ముదిరాజ్ ఘనంగా నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా నీలం మదు మాట్లాడుతూ కొర్వి కృష్ణస్వామి మహానేత స్వాతంత్ర్య సమరయోదుడు ,రచయిత పాత్రికేయుడు ,విద్యావేత్త ,బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియడారు. ఆయన బహుజన వర్గాల అభివృద్ధి కోసం తమ జీవితాన్ని అంకితం చేశారని గుర్తు చేశారు. హైదరాబాద్ నగర మేయరుగా వ్యవహరించిన సమయంలో కొర్వి కృష్ణస్వామి ముందు చూపుతో రూపొందించిన నగర మాస్టర్ ప్లాన్ ఎప్పటికి చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆయన అన్నారు. మహానేత ఆశయాల సాదించడానికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలని నీలం మధు పిలుపు నిచ్చారు.



## పాదయాత్రతో ఏడుపాయల అమ్మవారికి మొక్కు చెల్లింపు

మొక్కు చెల్లించుకున్న చిలిపిచేడు సర్పంచ్

**ప్రజాపక్షం/పాపన్నపేట :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మవారికి పాదయాత్రగా విచ్చేసి నూతన ఎన్నికైన సర్పంచ్ జూల అనిల్ కుమార్ మొక్కు చెల్లించుకున్నారు. కౌడిపల్లి మండలం చిలిపిచెడ్ గ్రామానికి నూతన సర్పంచ్ (బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి) గా గెలపొందిన జూల అనిల్, ఉప సర్పంచ్ కొర్పల శ్రీరామ్, ముఖ్య కార్యకర్తలతో కలిసి చిలిపిచెడు నుండి ఏడుపాయల క్షేత్రానికి 28 కిలోమీటర్లు మేర రహదారి వెంట పాదయాత్ర చేసి శుక్రవారం నాడు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎన్నికలలో గెలపొందగానే అమ్మవారి క్షేత్రానికి పాదయాత్రగా వచ్చి మొక్కు చెల్లించుకుంటానని మొక్కుకున్నట్లు తెలిపారు. అమ్మవారి సన్నిదనానికి పాదయాత్రగా రావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. వీరివెంట 65 మంది ముఖ్య నాయకులు పాదయాత్ర చేశారు.

## నారాయణఖేడ్‌లో ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్స్ అండ్ రిజిస్ట్రేషన్ మేళా

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకులు (ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు) కొరకు ఎఫ్ ఎస్ ఎస్ ఎఐ లైసెన్స్ ,రిజిస్ట్రేషన్ మేళా డిసింబర్ 20,2025 నిర్వహించనున్నట్లు జిల్లా అసెస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అధికారి అమృత శుక్రవారం నాడొక ప్రకటనలో తెలిపారు. ఈ మేళా జిల్లాలో సంగారెడ్డి, నారాయణఖేడ్ లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డిలో కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని గెజిటెడ్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయంలో నారాయణఖేడ్ లో శ్రీ వేంకటేశ్వర సినిమా థియేటర్ నందు ఉదయం 10.00 గంటల నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆహార వ్యాపార నిర్వాహకులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్సులు,రిజిస్టేషన్లు పొందడం, రెన్యువల్ చేసుకోవాలని ఆమె సూచించారు. మిగిత వివరాలకు 9908978790,9985600602 మొబైల్‌ను సంప్రదించాలని తెలిపారు.